


## స్పందనకు 252 సమస్యలు



చిత్తూరు, అక్టోబర్ 17 ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి ఈ వారం జిల్లా నలుమూలల నుండి ప్రజలు 252 సమస్యలను జిల్లా అధికారులకు విన్నవించుకొని పరిష్కరించాలని కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగి స్పందన కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్‌తో కలిసి ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ ప్రభుత్వం స్పందన కార్యక్రమంలో సమస్యలపై వచ్చిన అర్జీలను పరిష్కరించడానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. స్పందన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు.

## ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి : కలెక్టర్



రొంపిచెర్ల, అక్టోబరు17ప్రభాతవార్త
ప్రతి రైతు ఈ క్రాప్‌నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హరినారాయణ్ అన్నారు. సోమవారం ఆయన రొంపిచెర్ల మండలంలోని గానుగచింత, మోటుమల్లెల, బొమ్మయ్యగారిపల్లె గ్రామ పంచాయతీలలో రైతులు సాగు చేసిన వ్యవసాయ పంటలను పరిశీలించి ఈ క్రాప్ నమోదు చేశారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ మేళ్లయ్యగారిపల్లె సమీపంలోవ్యవసాయ పొలంలో ఉన్న సులోచన అనేమహిళా రైతును విచారించారు. వేరుశెనగ పంట సాగు చేశామని, అడవి పందులు పంటలను పూర్తిగా నాశనం చేశాయని విన్నవించారు. కనీసం రెండు బస్తాల కాయలు కూడా దిగుబడి రాలేదని ఆమె వాపోయారు. అదేవిధంగా జగడంవారిపల్లెకు చెందిన మహిళా రైతు సునీతను ఏ మేర దిగుబడి వచ్చిందని అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ రాజేంద్ర, తహశీల్దారు మురాషావలి, ఏవో సుధారాణి, ఆర్ఐలు వెంకటరమణారెడ్డి, అబ్దుల్ ఖాదర్, గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులు సుబ్రమణ్యం, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

# పేదల కోసమే నవరత్నాలు

### డిప్యూటీ సీఎం నారాయణస్వామి

వెదురుకుప్పం, అక్టోబర్ 17 ప్రభాతవార్త :
పేదల కోసమే నవరత్నాల పథకాలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తీసుకురావడం జరిగిందని రాష్ట్ర డిప్యూటీ సీఎం నారాయణస్వామి పేర్కొన్నారు. మండలంలోని టికెయం.పురం పంచాయితీ తూర్పుకొత్తూరు గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభించి గడప గడపకు వెళ్ళి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేసి, సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకు,పార్టీలకు అతీతంగా ప్రతి పేద, బడుగు వర్గాల అభ్యున్నతికోసం నవరత్నాల పథకాలు రూపకల్పన చేసి ప్రవేశ పెట్టారన్నారు. మెరుగైన వైద్య సేవలు అందించడం కొరకు ఆరోగ్యశ్రీ కార్యక్రమం తీసుకువచ్చారని చెప్పారు. విద్యా వ్యవస్థలో సమూలంగా ప్రక్షాలన చేసి ఆధునిక వసతులు, సౌకర్యలతో విద్యనందించడం కొరకు నాడు-నేడుతో నాణ్యతలో రాజీలేకుండా భవనాల రూపురేఖలు మార్చడం జరిగిందన్నారు. మహిళ సాధికారితతో కుటుం బాలకు ఆర్థిక పరిపుష్టి చేకూరుతుందని డ్వాక్రా సంఘం మహిళలకు రుణాలు మంజూరు చేయడంతో పాటు చేయూత, ఆసరా పథకాలు అమలు చేయడం జరుగుతుందని గుర్తు చేశారు. గడప గడపకు వెళ్ళి ప్రభుత్వం ప్రవేశ పెట్టుతున్న సంక్షేమ ఫలాలు అందడంపై ఆరా తీశారు. కరప పత్రం



పంపిణీ చేసి జగనన్నను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి నాగరాణి, జడ్పీటిసి చలం పాళ్యం సుకుమార్, ఎంపిడివో సధాకర్‌రావు, తహశీల్దార్ పుల్లా రెడ్డి, ఎపివో ఇందు, ఎపియం కవిత, అధికారులు, రాష్ట్ర వైసీపీ కార్యదర్శి బండి గోవర్ధన్ రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమ సుందర్ రెడ్డి, నాయకులు హేమచంద్ర రెడ్డి, బట్టే సుబ్రమణ్యం, రోసు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**చంద్రబాబు, పవన్‌కు సవాల్ విసిరిన నారాయణస్వామి :**

పేదల కోసం పనిచేస్తున్న ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడానికి టిడిపి అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కుట్రలు పన్నుతున్నారని నారాయణస్వామి ఆరోపించారు.ప్రజలలో ప్రభుత్వంపై ఉన్న ఆదరణను చూసి ఓర్వలేక రాష్ట్ర మంత్రులపై దాడులకు తెరతీశారని, ఇది చాలా అమానుష చర్య అన్నారు. మూడు రాజధానుల కొరకు ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. దుష్ప్రచారాలు, దాడుల చేయడం మానుకోవాలని హితవు పలికారు.

# రైతు సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన

### రైతు భరోసా పంపిణీ కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి, రైతులకు రూ.44 కోట్లు పంపిణీ





రైతు భరోసా చెక్కును పంపిణీ చేస్తున్న మంత్రి, ఎంపీ, కలెక్టర్ తదితరులు , సమావేశానికి హాజరైన రైతులు

సదుం, సోమల అక్టోబరు 17 ప్రభాతవార్త
రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు రైతు భరోసా నిధులను వారి ఖాతాల్లో జమ చేశారు. ఈకార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆళ్లగడ్డలో బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని చిత్తూరు జిల్లాలో పుంగనూరు నియోజక వర్గం సోమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు.కార్యక్రమాన్ని మంత్రి పెద్దిరెడ్డి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం అక్కడ వివిధ శాఖలు ఏర్పాటుచేసిన స్టాళ్లను పరిశీలించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ వరుసగా నాలుగో సంవత్సరం రెండో విడత కింద వైఎస్సార్ రైతు బరోసా,పీఎం కిసాన్ నిధులను జిల్లాలో 2,23,092 మంది రైతులకు రూ.44.762 కోట్లు విడుదల చేశారు. చెక్కును పంపిణీ చేశారు. దానితోపాటు సోమల మండలానికి మంజూరైన నిధుల చెక్కును అందజేశారు. ఆయన మాట్లాడుతూ పంటలు వేసే సమయంలోను, నూర్పిడి సమయంలోను డబ్బు అవసరమవుతుందని భావించి ముఖ్యమంత్రి రైతుల ఖాతాల్లోకి నిధులు వేస్తున్నారనిచెప్పారు. ఇతర రాష్ట్రాలలో ప్రధానమంత్రి కిసాన్ యోజన నిధులు రెండు వేలు మాత్రమే అందజేస్తుండగా మనప్రభుత్వం అదనం నిధులు వేస్తోందని చెప్పారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వ్యవసాయం దండగ అని చెప్పారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నాగం జనార్ధనరెడ్డి మంత్రిగా ఉండి రైతులు మానసిక వ్యాధితో ఆత్మ హత్యలు చేసుకుని చనిపోతున్నారని చెబితే ఇదే చంద్రబాబునాయుడు చప్పట్లు తట్టి నవ్వుకున్నాడన్నారు. రైతుల జీవితాలు దరిద్రంలో కూరుకు పోవడానికి ముఖ్య కారణం చంద్రబాబు అన్నారు. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక 80 శాతం ప్రాజెక్టులు పూర్తి చేశారన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ వంటి మహోన్నత పథకాన్ని ప్రవేశపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరు హరినారాయణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎప్పుడు లేని విధంగా పగటి పూట 9 గంటలు విద్యుత్ అందజేస్తున్నారని చెప్పారు. ఇన్‌పుట్ సబ్సిడీ, పంటనష్టాలు తదితరాలను ప్రభుత్వం రైతుల ఖాతాల్లోకి నేరుగా వేస్తు వారిని ఆదుకుంటోందని చెప్పారు.ప్రతి ఒక్కరు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు.జడ్పీ చైర్మెన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి,ఆరణి శ్రీనివాసులు,ఎంఎల్‌సీ భరత్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో వారితో పాటు చిత్తూరు ఎంపీ ఎన్.రెడ్డెప్ప,రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ ,మొదలియార్ కార్పొరేషన్, జానపద కళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్లు మురళీధర్,బుల్లెట్ సురేష్, కొండవీటినాగభూషణం, పిఎంకే ఉడాచైర్మెన్ వెంకటరెడ్డి యాదవ్, డీసీసీబ్యాంక్ చైర్‌పర్సన్ రెడ్డెమ్మ, జడ్పీవైస్‌చైర్మెన్లు ధనంజయరెడ్డి, రమ్య, రాష్ట్ర వైకాపా కార్యదర్శి పెద్దిరెడ్డి, స్త్రీ శిశుసంక్షేమ శాఖ రీజనల్‌ఆర్గనైజర్ శైలజారెడ్డి,జడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ ఉద్యానవన, పశు సంవర్ధక శాఖ అధికారులు మురళీధర్, మధుసూదన్‌రెడ్డి, వెంకట్‌రావ్,శోభారాణి,డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు తులసి, చంద్రశేఖర్, వివిధ మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు,సర్పంచిలు,ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు,పెద్దఎత్తున రైతులు పాల్గొన్నారు.

# విశాఖ గర్జనలో..వైకాపా దగాకోరు రాజకీయాలు

### ఎమ్మెల్సీ ఎన్నికలలో టిడిపి అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా పనిచేయండి : సోమిరెడ్డి - అమరావతి మద్దతుగా రైతుల ర్యాలీకి సంఘీబావం




తిరుపతిరూరల్, అక్టోబర్ 17 ప్రభాతవార్త:
ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి.... ఎమ్మెల్సీ ఎన్నికలలో టిడిపి బలపరిచిన అభ్యర్థులను గెలుపరచాలని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పిలుపు నిచ్చారు. మూడు రాజధానులకు మద్దతుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన విశాఖ గర్జనపై మాజీ మంత్రి మండిపడ్డారు. అది విశాఖ గర్జన కాదు...దగ కోరు రాజకీయాలకు వేదిక అని ఏద్దేవా చేసారు. అమరావతి రాజధాని మద్దతుగా సోమవారం రామానాయుడు కళ్యాణ మండపంలో జిల్లా విస్తృతస్థాయి సమావేశం జరిగింది. వైకాపా మూడు రాజధానుల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ .... అమరావతినే ఏకైక రాజధానిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ అందోళన చేపట్టారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు, చంద్రగిరి ఇన్‌చార్జి పులివర్తి నాని, తిరుపతి పార్లమెంటరి అధ్యక్షుడు నరసింహయాదవ్ ఆధ్వర్యంలో జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో మాజీ మంత్రి సోమిరెడ్డి మాట్లాడుతూ మూడు రాజధానుల ఆలోచన దుర్మార్గమైనదని, ఉత్తరాంధ్ర ప్రజల్లోంచి వచ్చింది కాదని, దోఫిడిలు, దౌర్జన్యాలు నుండి జనం దృష్టి మరలించటానికి సి.యం.జగన్ చేస్తున్న కుట్రగా వర్ణించాడు. రాజకీయ ప్రయోజనాల కోసం మంత్రులు రోజా, ఎం.పి.మిధున్‌రెడ్డి విశాఖ గర్జనలో పాల్గొన్నారని ఆరోపించారు. ఇలాంటి వారికి ప్రజా కోర్టులో శిక్ష తప్పదని హెచ్చరించారు. అనంతరం అమరావతి రాజధానిగా కొనసాగించాలని రైతులు చేపట్టిన యాత్రకు సంఘీభావంగా 150 బైపాస్ రోడ్డులో పాదయాత్ర చేసి నిరసన తెలిపారు. తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో మాజీ మంత్రి అమర్నాథరెడ్డి, మాజీ ఎం.పి. పనబాక లక్ష్మీ, ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీకాంత్, టిడిపి నేతలు నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు దొరబాబు, గౌనివారి శ్రీనివాసులు, చల్లా బాబు, మాజీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ, దొమ్మపాటి రమేష్, శంకర్ యాదవ్, నాయకులు గాలి భాను ప్రకాష్, జెడి రాజశేఖర్, పెళ్ళకూరు శ్రీనివాసులరెడ్డి, మునిరత్నం, శ్రీనాథరెడ్డి, తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఎ.ఈశ్వరరెడ్డి, మధు, ఉసిరిపాటి శ్రీనివాసులు, బిరుదాల భాస్కర్‌రెడ్డి, కత్తి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.70 లక్షల విలువైన ఎర్రదుంగలు పట్టివేత

### రెండు వాహనాలు స్వాధీనం - ఒక స్మగ్లర్ అరెస్టు, ఇద్దరు పరారీ : డిఎస్పీ

చిత్తూరు, అక్టోబర్ 17 ప్రభాతవార్త:



చిత్తూరు ఈస్ట్ సర్కిల్ పోలీసుల ఆధ్వర్యంలో పెనుమూరు మండలం దేవళంపేట కొత్తరోడ్డుకు సమీపంలో పోలీసులు 70 లక్షల విలువైన 500 కేజీల 28 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకొని ఒక వ్యక్తిని అరెస్టు చేసి రెండు వాహనాలను సీజ్ చేశారు. చిత్తూరు నగర డిఎస్పీ సుధాకర్‌రెడ్డి తాలుకా స్టేషన్‌లో సోమవారం విలేకరులకు వివరాలు వెళ్ళడిస్తూ ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు తన ఆధ్వర్యంలో చిత్తూరు ఈస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ మద్దయ్యచ్చారి, తాలుకా ఎస్ఐ రామకృష్ణ, పెనుమూరు ఎస్ఐ అనిల్‌కుమార్, ఎన్ఆర్‌పేట ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి, ఐడి పార్టీ సిబ్బంది ఎర్రచందనం స్మగ్లింగ్ జరుగుతుందని సమాచారం అందడంతో హుటాహుటిన పెనుమూరు మండలం దేవళంపేట కొత్తరోడ్డు వద్దకు చేరుకొని ఆదివారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. ఈ క్రమంలో సాయంత్రం 5 గంటల సమయంలో నేంద్రగుంట నుండి దేవళంపేట వైపుకు వస్తున్న రెండు కార్లను పోలీసులు తనిఖీ చేయడానికి ప్రయత్నించారన్నారు. ఈ కార్లలో ఎర్రచందనం దుంగలు అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తుల్లో ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి కారును నిలుపుదల చేసి ప్రక్కనే వున్న అడవిలోకి పారిపోయారన్నారు. మరొక కారులో వున్న పి.వెంకటేష్(29) వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారన్నారు. పోలీసుల విచారణలో పి.వెంకటేష్ తమిళనాడు రాష్ట్రం తిరుణ్ణామలై జిల్లా పోలూరు తాలుకా కేశవరం పోస్టు, పడవేడు గ్రామంగా తెలిసిందన్నారు. పోలీసుల నుండి తప్పించుకొని పారిపోయిన వారిలో తమిళనాడు కన్నమంగళంకు చెందిన జగన్, రాజులు వున్నారన్నారు. వీరి కోసం పోలీసులు గాలింపులు చేపట్టారన్నారు. పట్టుబడిన ఎర్ర దుంగల విలువ 50 లక్షల రూపాయలు వుంటుందని, అలాగే రెండు వాహనాల విలువ 20 లక్షల రూపాయలు వుంటుందని డిఎస్పీ సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా పట్టుకొన్న పోలీసు సిబ్బందిని ఈ సందర్భంగా చిత్తూరు నగర డిఎస్పీ సుధాకర్‌రెడ్డి అభినందించారు.

## సెక్యూరిటీ బిల్లుల మాయాజాలం!

### శివయ్య ఆదాయానికి గండి కొడుతున్న వైనం

శ్రీకాళహస్తి,అక్టోబర్ 17 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలో దొరికినోళ్ళకు దొరికినంత మహాదేవా అని దోచుకుంటున్నారు. శివయ్య ఆదాయాలకు గండి కొడుతున్నారు. శివయ్యకే శఠగోపం పెడుతున్నారు.ఇక్కడ సెక్యూరిటి వివాదాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో సెప్టెంబర్‌మాసంలో ఇష్టారాజ్యంగా బిల్లులు పొందుపరచి తన ప్రమేయంలేకుండా బిల్లులు చేసుకున్నారని సెక్యూరిటి ఇన్‌చార్జి మణి ఆరోపించారు. ఇలా బిల్లులతో శివయ్యకు సుమారు రూ.7.31లక్షలు శఠగోపం పెట్టారని తీవ్ర ఆరోపణలు చేసారు.అయితే ఈ ఆరోపణలకు సంబంధించి వివరణ కోరటానికి డెప్యూటి ఇఒను చరవాణి ద్వారా ప్రయత్నిస్తే ఆయన అందుబాటులో లేదు. చరవాణి తీయలేదు. సెక్యూరిటికి సంబంధించి మణి అందించిన సమాచారం ఇలా ఉంది.ఆలయంలో సెంట్రల్ కమెండో సెక్యూరిటి సర్వీసు పేరుతో ఇక్కడ సెక్యూరిటిని నిర్వహిస్తున్నామని దానికి తాను ఇన్‌చార్జిగా ఉన్నానని మణి తెలిపారు. సెప్టెంబర్ నెలలో ఒక రోజుకి 204 పాయింట్లకు గాను 153 పాయింట్లను ఎక్కించమని సెక్యూరిటి ఎండి ఆదేశాలతో 153 పాయింట్లు డ్యూటీలు ఎక్కించమన్నారు. సెప్టెంబర్‌లో గార్డు జీతాలుకు గాను 204 పాయింట్లకు బిల్లులు రూపొందించి నివేదికలు అందించారు. బిల్లులు చేసుకున్నారు. సెక్యూరిటి ఇన్‌చార్జిగా తాను బిల్లు మీద సంతకం పెట్టనప్పటికి బిల్లుల చేసారు.దీనికి గాను దేవస్థానం నుంచి రూ.7.31లక్షలు అదనంగా డ్రాచేసుకున్నారు. ఇలా ఆలయ ఆదాయానికి గండికొడుతూ పబ్బం గడుపుకుంటున్నారని ఆరోపించారు.

### జీఎస్ఎల్‌వీ మార్క్3 ప్రయోగం తర్వాత

## మళ్లీ పీఎస్ఎల్‌వీ సీ-54 ప్రయోగం

### - షార్‌లో సందడి



శ్రీహరికోట (తడ), అక్టోబర్ 17 ప్రభాతవార్త
భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం శ్రీహరికోట నుంచి ఈ నెల 23న జీఎస్ఎల్‌వీ మార్క్3 ప్రయోగం పూర్తి చేసిన వెంటనే మరో రాకెట్ ప్రయోగానికి శాస్త్రవేత్తలు సిద్ధమవుతున్నారు. రెండో లాంచ్ ప్యాడ్ నుంచి మార్క్3 ప్రయోగం జరగనుండగా, దానికి సమాంతరంగా మొదటి ప్రయోగ వేదికపై పీఎస్ఎల్‌వీ సీ-54 ప్రయోగ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఇటీవల షార్‌లో రాకెట్ ప్రయోగాలకు సంబంధించి వేగం పెంచారు. ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల సందడి ముగిసిన తర్వాత రాకెట్ ప్రయోగాల సందడి కొనసాగుతోంది. ఇదిలావుంటే జీఎస్ఎల్‌వీ మార్క్3 రాకెట్ ద్వారా యూకే ఉపగ్రహాలను ప్రయోగిస్తున్న నేపథ్యంలో స్వదేశీ, విదేశీ శాస్త్రవేత్తలతో షార్ నిండిపోయింది. యూరోపియన్ స్పేస్ ఏజన్సీ (ఈసా) శాస్త్రవేత్తలతో పాటు మన ఇస్రో శాస్త్రవేత్తలు సంయుక్తంగా ఈ రాకెట్ ప్రయోగ సన్నాహాల్లో ఉన్నారు. రాకెట్ ప్రయోగానికి ముందు జరిగే వివిధ పరీక్షలు, తనిఖీలను ఒక్కొక్కటిగా విజయవంతంగా చేసుకుపోతున్నారు. బంగాళాఖాతంలో అల్పపీడనం వార్తలు వినిపించినప్పటికీ సోమవారం సాయంత్రానికి రాకెట్ ప్రయోగ కేంద్రం వద్ద ప్రశాంత వాతావరణం కనిపించడంతో రాకెట్ ప్రయోగ సన్నాహాలు మరింత వేగం పుంజుకున్నాయి.

# శివయ్య దర్శనానికి తగ్గేదేలే ...



### 23వేల మంది దర్శనం
### రికార్డు స్థాయిలో అభిషేకాలు

శ్రీకాళహస్తి,అక్టోబర్ 17 ప్రభాతవార్త
సోమవారం శివయ్య సన్నిధి భక్తులతో కిక్కిరిసింది. రికార్డు స్థాయిలో అభిషేకాలు జరిగాయి. ఉదయం నుంచి ఆలయంలో ఇసుకేస్తే రాలనంత రద్దీ చోటు చేసుకుంది. సోమవారం సుమారు 223వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు అధికారులు ప్రకటించారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి లెక్కలేనంత మంది అతిథులు వస్తున్నారు. దాంతో ఈ ఆలయానికి భక్తి శ్రద్దలతో వచ్చే భక్తుల దర్శనం పరిస్థితి ఆగమ్యగోచరంగా మారుతుంది. అతిథుల ముసుగులో దళారులు తమ పబ్బం గడుపుకుంటున్నారు. పేరుకు సంస్కరణలు, రికార్డులు, నమోదులు. అయితే దళారుల దందా యథేచ్ఛగా సాగుతుంది. ఇక్కడి ఆలయంలో లెక్కకు మించి ఎపిఆర్ఓలు ఉండటంతో ఎవరు ఎవరిని దర్శనాలకు తీసుకెళుతున్నారన్నది ప్రశ్నార్థకంగా మారింది. సోమవారం సాయంత్రం అందిన సమాచారం మేరకు 23వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నట్లు వివరించారు. సాయంత్రం కూడా ప్రత్యేక రాహుకేతుదోష నివారణ పూజలకు భక్తులు కిక్కిరిసి కనబడ్డారు. అయితే నిత్యం ఇఒ వికె సాగర్‌బాబు ఆదేశాలతో అదికారులు ఆలయంలో పరిశీనలు జరుపుతున్నారు. రాహుకేతుదోష నివారణ మండపాల్లో నిఘా పెట్టారు.అయితే దళారుల దందా కొనసాగుతూనే ఉంది.

**అభిషేకాల్లో రద్దీ రద్దీ రద్దీ:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం నిర్వహించే అభిషేకాలకు భక్తులు తండోపతండాలుగా కదలి వస్తున్నారు. ఉదయం నుంచే కాకుండా సాయంత్రం నిర్వహించే మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలకు రద్దీ ఏర్పడుతుంది. దాంతో అభిషేకాలకు హాజరయ్యే భక్తులు అసంతృప్తితో వెనుదిరుగుతున్నారు.సోమవారం కూడా అభిషేకాలకు సొమ్ములు చెల్లించిన వారు రన్నింగ్ క్యూతో తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. సాయంత్రం అభిషేకాలకు కూడా ఇసుకేస్తే రాలనంత రద్దీ చోటు చేసుకుంది. శ్రీకాళహస్తీశ్వరాలయానికి శనివారం రూ.200 దర్శనం టిక్కెట్లుతో 463 మంది, రూ.50ల దర్శనం టిక్కెట్లులో 1510 మంది రాహుకేతుదోష నివారణ పూజలకు సంబంధించి రూ.500లు టిక్కెట్లు 2193 మంది, రూ.750టిక్కెట్లతో 834, రూ.1500 టిక్కెట్లు కొనుగోలు చేసిన 239 మంది భక్తులు రూ.2500ల టిక్కెట్లు కొనుగోలు చేసి 201 మంది, రూ.5వేల టిక్కెట్లు 52 కొనుగోలు చేసి పూజలు జరిపించుకున్నారు. కాగా అభిషేకాలు 127 శనీశ్వరాభిషేకాలు 8,మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు 32 జరిగినట్లు సమాచారం అందించారు.

### ఉష్ణోగ్రతలు
17/10/2022



- తిరుపతి 32 డిగ్రీలు
- చిత్తూరు 33 డిగ్రీలు
- మదనపల్లి 27 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 33 డిగ్రీలు
- వెంకటగిరి 33 డిగ్రీలు
- గూడూరు 33 డిగ్రీలు

### బంగారం ధరలు
17/10/2022



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 4,691
24క్యారెట్స్ 1గ్రాము రూ.5,117

### కోడిగుడ్డు ధరలు
17/10/2022



కోడిగుడ్డు :రూ.6.00
1 డజను: రూ.72.00

# పారదర్శంగా ప్రభుత్వ పథకాల అమలు ప్రభుత్వ లక్ష్యం

**పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు**

ఐరాల, అక్టోబర్ 17 ప్రభాతవార్త:



అవనీతి అక్రమాలకు తావు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి పారదర్శకంగా ప్రభుత్వ పథకాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు అన్నారు. సోమవారం మండలంలోని నాగంవాండ్లపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని అరుణానగర్ కాలనీ, జంగాలపల్లె తదితర గ్రామాలలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంను నిర ్వహించారు. ఈసందర ్భంగా ఎమ్మెల్యే ఆయా గ్రామాలలో ఇంటింటికి వెళ్ళి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే పథకాలు అర్హులైన పేదలందరికి అందుతున్నా యా? లేదా? అని పరిశీలించారు. గ్రామాలలో ప్రజలు తమ తమ సమస్యలను తన దృష్టికి తీసుకు వస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే బాబు ఆదేశించారు. ప్రజల నుండి వచ్చిన వివిధ సమస్యలను వెంటనే పరిష్కరించడానికి అధికారులు తగు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఎంఎస్.బాబు అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్ర మంలో ఎంపీపీ చింతం మోహన్, ఎంపీడీఓ నిర్మలాదేవి,తహశీల్దార్ మండల వైకాపా కన్వీనర్ పట్నం బుజ్జిరెడ్డి, వైస్ ఎంపీపీ నిత్య, నాయకులు చలపతిరెడ్డి, పూజారి మోహన్‌రెడ్డి, ధనచంద్రారెడ్డి, సురేంద్రరెడ్డి, సురేష్‌రెడ్డి, వేణుగోపాల్, రవిప్రసాద్, గణేష్ ప్రసాద్‌రెడ్డిలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సక్రమంగా విధులకు హాజరుకాని వైద్యాధికారిపై ఎమ్మెల్యే ఆగ్రహం

ఐరాల, అక్టోబర్ 17 ప్రభాతవార్త:

మండల కేంద్రం ఐరాల పీహెచ్‌సీలో పనిచేసే వైద్యాధికారి సకాలంలో విధులకు సక్రమంగా హాజరు కాకపోవడంతో స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్.బాబు తీవ్ర ఆగ్రహం వ ్యక్తం చేశారు. మండలంలో గడప గడపకు–మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్.బాబు సోమవారం ఐరాల పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఉదయం 10 గంటలు అవుతున్నా పీహెచ్‌సీ వైద్యాధికారి విధులకు హాజరు కాకపోవడాన్ని గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సౌకర్యార్థం పెద్ద ఆస్పత్రి వున్నప్పటికి రోగులకు వైద్యసేవలు అందించేందుకు వైద్యాధికారి సక్రమంగా అందుబాటులో లేకపోవడంతో ప్రజలు వైద్య ం కోసం చిత్తూరుకు వెళ్ళ వలసి వస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులు వైద్యం కోసం ఆస్పత్రిలో వేచి వుండలా అంటూ మండి పడ్డారు. విధులకు సక్రమంగా, సకాలంలో హాజరుకాని వైద్యాధికారిపై వెంటనే తగు చర్యలు తీసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే వెంట స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, పుంగనూరు కుప్పం

## కండిషన్‌లో ఉన్న ఆర్టీసీ బస్సులు నడపాలి

కుప్పం, అక్టోబర్ 17 ప్రభాతవార్త



కుప్పం డిపోపరిధిలో కండిషన్‌లో ఉన్న ఆర్టీసీ బస్సులను నడపాలని సామాజికవేత్త మునిరాజాబాబు సోమవారం ఆర్టీసీ డిఎం టికె స్వామిని కోరారు. కుప్పం డిపోలోని బస్సులను ఇతర డిపోలకు తరలించి ఇక్కడ కాలం చెల్లిన బస్సులు నడపడం తగదన్నారు. తరచూ బస్సులు ఎక్కడబడితే అక్కడ ఆగిపోయి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అలాగే కుప్పంలో నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ షాపింగ్ కాంప్లెక్స్‌ను వినియోగంలో తేవాలని కోరారు. అలాగే స్థానిక టౌన్‌బ్యాంక్‌లో షేర్ హోల్డర్లతో మరోసారి మహాజన సభ నిర్వహించాలని ఆయన బా ్యంకు అధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ప్రకాష్‌తదితరులు పాల్గొన్నారు.

## ఫిట్ ఇండియాపై వ్యాసరచన పోటీలు

చిత్తూరురూరల్, అక్టోబరు 17 ప్రభాతవార్త:

జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయ ఆవరణలో ఈనెల 19వ తేది ఉదయం 11గంటలకు 9,10 వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఫిట్‌ఇండియాపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు చీఫ్ కోచ్ ఎ.బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు తాము చదువుతున్న హెడ్‌మాస్టర్‌చే జారీ చేయబడ్డ ఐడెంటిటీకార్డు, ఫ్యాడ్ పెన్ తీసుకొని వచ్చి 100 వాక్యాలు మించకుండా ఫిట్‌ఇండియా కార్యక్రమం మీద వ్యాసం రాయాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయ ఫోన్‌నెం. 08572- 295619ను సంప్రదించాలని కోరారు.

## శ్రీ సత్యసాయి సమితి, జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల విజేతలు

చిత్తూరురూరల్, అక్టోబరు 17 ప్రభాతవార్త:

శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, విద్యావిభాగం తరపున సమితి, జిల్లా స్థాయిలో సెప్టెంబరు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ఉత్తమప్రతిభ కనబరచిన విద్యార్థుల వివరాలను శ్రీ సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మధుసూదనం సోమవారం ఒక ప్రకటనలో విడుదల చేసారు. ఉన్నత పాఠశాల విభాగం(తెలుగు, ఇంగ్లీషు)లో కె.భావన, ఎస్.ప్రనోద్‌సాయి, కె.హారిక, కె. కుబేర లక్ష్మీ, ఎస్. గాయత్రీ, ఎ. మోహన్‌కుమార్, ఎస్. సౌమ్య, జూనియర్ కళాశాల విభాగం(తెలుగు, ఇంగ్లీషు)లో కె. జ్యోషిత, ఎం. తనుశ్రీ, ఎస్. అబుకర్ సిద్దిక్, కె.రోజ, కె.దేవిక, శ్రీ దీక్షిత, వి. అభినాష్, డిగ్రీ స్థాయి( తెలుగు, ఇంగ్లీషు)లో టి. లక్ష్మీ, ఎస్.రమ్య, కె. దేవిక, రోషిత చౌదరిలు ఉత్తమ ప్రతిభ కనబరచారని పేర్కొన్నారు. సమితి, జిల్లా స్థాయిలో మొదటి, రెండవ, తృతీయస్థానాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

## కుప్పం ఎంపిడిఒగా జానకమ్మ బాధ్యతలు

కుప్పం, అక్టోబర్ 17 ప్రభాతవార్త



కుప్పం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా జానకమ్మ బాధ్యతలు చేపట్టారు.ఇదివరకు ఈమె కుప్పం మండల కార్యాలయంలోనే సూపరింటిండెంటుగా విధులు నిర్వహించేవారు. ఇన్‌చార్జ్ ఎంపిడిఒ విజయదత్ సెలవుపై వెళ్లిపోవడంతో ఉన్నతాధికారులు ఇన్‌చార్జ ఎంపిడిఒగా జానకమ్మను నియమించారు. ఈసందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల సహకారంతో మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు తన వంతు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణదేవరాయల 493వ వర్ధంతి



కుప్పంరూరల్, అక్టోబర్ 17 ప్రభాతవార్త

విజయనగర సామ్రాజ్యాధీశుడు శ్రీకృష్ణదేవరాయల 493వ వర్ధంతిని కుప్పంలో బలిజ సేవా సంఘం అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాయల వారి విగ్రహంకు పూజలు చేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఎపిఐడిసి డైరెక్టర్ నందకుమార్ మాట్లాడుతూ బలిజ కమ్యూనిటీ భవనం కోసం కేటాయించిన భూమిలో త్వరలోనే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాలతో 45లక్షలతో ప్రహరీగోడ నిర్మించడం జరుగుతుందని అలాగే సుమారు 2కోట్ల అంచనాతో కమ్యూనిటీ భవనం నిర్మాణంకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో సంఘ నేతలు సత్యేంద్రశేఖర్, మిట్టపల్లి చలపతి, ప్రభాకర్, మంజునాథ్, హరినాథ్, అజయ్, హర్షధర్మతేజ, జగన్నాథం, నాను, శివ పాల్గొన్నారు.

## బంగారు నగల దుకాణాలపై ఆర్డీఒకు ఫిర్యాదు

కుప్పం, అక్టోబర్ 17 ప్రభాతవార్త



కుప్పంలోని పలు బంగారు నగల దుకాణాలు ప్రజలను మోసం చేస్తున్నాయని వీరిపై చర్యలు చేపట్టాలని కుప్పం ఆర్డీఒ శివయ్యకు ఎంఎస్‌పి రాష్ట్ర నేత దేవరాజు మాదిగ ఫిర్యాదు చేశారు. పలు బంగారు దుకాణాల్లో నిబంధనలకు విరుద్ధంగా జిఎస్టీ బిల్లులు ఇవ్వడం లేదని కేవలం ఇన్‌వాయిస్ బిల్లులు ఇస్తున్నారన్నారు. అలాగే రెడీమేడ్‌గా తయారై ఉన్న బంగారు ఆభరణాలపై తరుగు, కూలీ పేరిట డబ్బులు అధికంగా వసూలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బయటి ప్రాంతాల్లో చోరీ చేసిన బంగారాన్ని తక్కువ ధరలకే కొనుగోలు చేసుకుంటూ అధిక ధరలకు విక్రయిసు_న్నారన్నారు.

## ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పథకాలు అమలు : ఎమ్మెల్యే

చిత్తూరు, అక్టోబర్ 17 ప్రభాతవార్త:



సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజా సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేస్తున్నారని ఈ పథకాలను సద్వినియోగం చేసుకొని అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా ముందడుగు వేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 23వ డివిజన్ జానకారపల్లిలో సోమవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వం అందజేస్తున్న పథకాల వివరాలను ప్రజలకు వివరించారు. అర్హులుగా వుండి పథకాలు అందకుండా వుంటే వారు మళ్ళీ కొత్తగా పథకాల కోసం దరఖాస్తు చేసుకొంటే అధికారులు పరిశీలించి మంజూరు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ లక్ష్మణస్వామి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాహుల్‌రెడ్డి, కార్పొరేటర్లు పూర్ణచంద్ర, చల్లముత్తు, కో–అప్షన్ సభ్యుడు కోలా కిరణ్, వైకాపా నాయకులు అప్పు, సురేష్, నారాయణ, రెడ్డప్ప, మస్తాన్, కుమార్, శేఖర్, కోటి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడికి సత్కారం



పెద్దపంజాణి అక్టోబర్ 17 ప్రభాతవార్త :

మండలంలోని కొత్తముద్దేపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు హరిప్రసాద్ 8వ తరగతి పాఠ్య పుస్తక రూపకల్పనలో కీలక పాత్ర పోషించడంతో పాటు విధ్యార్థులకు వినూత్నరీతిలో అర్థమయ్యేలా అందించిన నూతన బోధనా విధానంలోని దీక్ష,నిస్తా, తరల్,ఎఫ్.ఎల్.ఎన్,వుయ్ లవ్ రీడింగ్ వంటి వాటికి రాష్ట్రస్థాయిలో విశేష నైపుణ్యాలుగా వ్యవరించడంతో మండల విధ్యాశాఖా అధికారిణి హేమలత ఉపాధ్యాయుడు హరిప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విషయ నిపుణులు అంజాద్, రాజా,రాజేష్,సిఆర్‌పిలు రమేష్,ఉపాధ్యాయులు శ్రీనివాసులు, శివశంకర్, సంగీత, అంబిక, శరదాంబ తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

బంగారుపాళ్యం, అక్టోబర్ 17 ప్రభాతవార్త:

బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ.కరుణకుమార్ పేర్కొన్నారు. మండలంలోని వెలుతురుచేను పంచాయతీ కోళావాళ్ళవూరు ఎస్టీ కాలనీలో సోమవారం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.రోప్ సంస్థ, చిల్డ్రన్ బిలీవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ.కరుణకుమార్ మాట్లాడుతూ కనీస వివాహ వయస్సును భారత ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. బాల్య వివాహాలు చేయడం వల్ల జరిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. ఒరిస్సా రాష్ట్రం గంజాం జిల్లాలో బాల్య వివాహాలు లేని జిల్లాగా భారతదేశంలో పేరుగడించిందన్నారు. బాల్య వివాహాల అడ్డుకట్టకు తీసుకోవాల్సిన చర్యలపై రూపొందించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. సర్పంచ్ సుబ్రమణ్యం, రోప్ సంస్థ డైరెక్టర్ ధనశేఖర్, ఎఎస్‌ఐ మల్లప్ప, ఇన్‌ఛార్జీ ఎంపిడిఓ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు జగనన్న కిట్లు పంపిణీ

కుప్పంరూరల్, అక్టోబర్ 17 ప్రభాతవార్త



మండలంలోని మల్లానూరు పంచాయతీ కృష్ణాపురం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భవతులకు జగనన్న పౌష్టికాహార కిట్లను రాష్ట్ర వన్నియకుల క్షత్రియ కార్పోరేషన్ ఛైర్మన్ వనిత శ్రీను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి,బిడ్డల ఆరోగ్యం కోసం సిఎం జగనన్న ఆదేశాలతో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా క్రమం తప్పక పౌష్టికాహారం అందించడం జరుగుతోందన్నారు.

## రాజేష్‌బాబుకు డాక్టరేట్ ప్రదానం



కుప్పం, అక్టోబర్ 17 ప్రభాతవార్త

ద్రవిడ వర్సిటీ తెలుగుశాఖలో పరిశోధన చేస్తున్న రాజేష్‌బాబుకు పిహెచ్‌డి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ నాగేశ్వరరావు తెలిపారు. తెలుగుశాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా॥ పళని పర్యవేక్షనలో చిత్తూరు జిల్లా ప్రముఖ రచయితలు – దళితవాద స్పృహ అనే అంశంపై రాజేష్‌బాబు సమర్పించిన గ్రంథానికి డాక్టరేట్ అందించినట్లు తెలిపారు. ఈసందర్భంగా అతన్ని వర్సిటీ బోధన, బోధనేతరసిబ ్బంది, స్కాలర్లు అభినందించారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## 4186 కుటుంబాలకు రైతు భరోసా

కోట, అక్టోబర్ 17 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన వైఎస్సార్ రైతు భరోసా పీఎం కిసాన్ నిధులు కోట మండలంలో 4186 కుటుంబాల వారు అర్హత పొందారని మండల వ్యవసాయాధికారి నిరంజన్‌కుమార్ తెలిపారు. వరుసగా నాలుగో ఏడాది కూడా రెండోవిడతగా ఖరీఫ్ ముందే రైతులకు రాష్ట్రప్రభుత్వం 13500 రూపాయలు రైతు భరోసా సాయం అందిస్తున్నట్లు చెప్పారు. నాలుగో ఏడాది మొదటి విడతగా 7500 రూపాయలు చొప్పున ఇప్పటికే ప్రభుత్వం జమ చేసిందని పేర్కొన్నారు. రెండోవిడతగా పంటకోతకు, రబీ అవసరాలకు ఒక్కొక్కరికి మరో నాలుగు వేల రూపాయలు చొప్పున రైతన్నల ఖాతాలలో ప్రభుత్వం జమ చేసిందన్నారు. వచ్చే సంక్రాంతికి మూడో విడతగా మరో రూ.2 వేలు ప్రభుత్వం అందజేస్తుందని ఆయన చెప్పారు.

## రైలు కింద పడి ఒకరి మృతి

తడ, అక్టోబర్ 17 ప్రభాతవార్త

తడ వద్ద రైలు కింద పడి మృతిచెందిన యువకుని శవాన్ని సోమవారం రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తడ, సూళ్లూరుపేట మార్గంలో 67వ కిలోమీటర్ వద్ద సుమారు 35 ఏళ్ల వయస్సు ఉన్న యువకుడు మృతిచెంది ఉండగా స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. జీఆర్‌పీ ఎస్‌ఐ మాలకొండయ్య ఆధ్వర్యంలో రైల్వే పోలీసులు శవాన్ని స్వాధీనం చేసుకొని సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ యువకుని గురించి సమాచారం కోసం ఆరా తీస్తున్నారు.

## సృజనాత్మకతతో బోధించాలి - ఎంఈవో

కోట, అక్టోబర్ 17 ప్రభాతవార్త

ఉపాధ్యాయులు తరగతి గదిలో విద్యార్థులకు సృజనాత్మక బోధన చేయాలని మండల విద్యాశాఖ అధికారి ఎం.వెంకటసునీల్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు నైపుణ్య శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నూతన విధానాలపై బోధన సాగించాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులుగా మారి ఎప్పటికప్పుడు తమ స్కిల్స్‌ను ఉపయోగించాలని సూచించారు. ఈ శిక్షణా తరగతుల్లో 41 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ యూత్‌కన్వీనర్‌గా దేవల పోలయ్య నియామకం

ఓజిలి, అక్టోబరు 17 ప్రభాతవార్త:

ఆమ్ ఆద్మీ పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ యూత్ కన్వీనర్‌గా ఓజిలి మండలం మానమాల గ్రామానికి చెందిన దేవల పోలయ్యను సోమవారం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్‌కే పట్టం నియమించారు. ఈ సందర్భంగా పోలయ్య మట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించిన ఆర్‌కే పట్టంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పోలయ్యను నాయకులు శాలువలు కప్పి పూలమాలతోసన్మానించారు. ఆయన వెంట సూళ్లూరుపేట నియోజకవర్గ కన్వీనర్ పట్టపు రవి, మండల కన్వీనర్ నంది, మండల మోహన్‌రాజు పాల్గొన్నారు.

## నాయుడుపేటలో యధేచ్ఛగా పందుల సంచారం

నాయుడుపేట, అక్టోబర్ 17 ప్రభాతవార్త


నాయుడుపేట పట్టణంలో పందుల సంచారం రోజురోజుకీ పెరిగిపోతోంది. అసలే వర్షాకాలం, దీనికితోడు పట్టణంలో దోమల ఉత్పత్తి పెరిగి పట్టణ ప్రజలకు నిద్రలేకుండా చేస్తోంది. పందులపై దోమలు వాలి అవి కాస్తా మనుషులను కుట్టడం వల్ల మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి విషజ్వరాలకు గురవుతున్నట్లు పట్టణ ప్రజలు వాపోతున్నారు. ఇదిలావుంటే నాయుడుపేట మున్సిపల్ సమావేశంలో సైతం కౌన్సిలర్లు పలు సమస్యలపై గళమెత్తారు. పందులు వీధుల్లో యధేచ్ఛగా తిరుగుతున్నాయని, వెంటనే పందుల సంచారాన్ని అరికట్టాలని విజ్ఞప్తి చేశారు.

## రుణాలను సకాలంలో చెల్లించండి

కోట, అక్టోబర్ 17 ప్రభాతవార్త :పొదుపు మహిళలు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించాలని కెనరా బ్యాంకు మేనేజర్ హరీష్ కోరారు. సోమవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో పొదుపు రుణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ హరీష్ మాట్లాడుతూ పొదుపు గ్రూపులపై తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే తిరిగి కొత్త వారికి రుణాలు ఇచ్చేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. తమ సిబ్బంది గ్రామాల చుట్టూ రుణాల రికవరీ కోసం తిరగాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని చెప్పారు. ఈ సమావేశంలో ఏపీఎం రత్నయ్య, సీసీలు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

వాకాడు, అక్టోబర్ 17, ప్రభాతవార్త



వాకాడు మండలం బాలిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు నాగరాజు, వెంకటరెడ్డి పాలెం పాఠశాల ఉపాధ్యాయురాలు హారతిలకు సోమవారం వాకాడు సొసైటీ అధ్యక్షులు దామోదర్ రెడ్డి, ఎంఈవో బాబు ఇరువురిని ఉపాధ్యాయులను పూల మాల వేసి శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దామోదర్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికైన వారిని ఆయన అభినందించారు. సమాజ శ్రేయస్సు కోసం దిక్సూచిగా వ్యవహరించే సమ్మున్నతమైన వృత్తి అధ్యాపక వృత్తిని ఇటువంటి వృత్తిలో జిల్లా స్థాయిలో మండలానికి సంబంధించిన ఇద్దరు అధ్యాపకులు ఎంపిక కావడం సంతోషమని, మరెన్నో రాష్ట్ర స్థాయిలో అవార్డులు తీసుకోవాలని ఆయన కోరారు. ఎంఈఓ బాబు మాట్లాడుతూ వృత్తి పట్ల నిబద్ధత నిజాయితీలకు పట్టం కట్టే విధంగా ఉపాధ్యాయులకు అవార్డును ఇవ్వడం ఎంపిక చేయడం జరిగిందని ఆ క్రమంలో మండల పరిధిలోని ఇద్దరు ఉపాధ్యాయులకు జిల్లా స్థాయి అవార్డులు రావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. మండలంలోని ఉపాధ్యాయులు మరెంతో ఉత్సాహంతో పని చేసి రానున్న రోజుల్లో ఉత్తమ ఉపాధ్యాయులుగా, ప్రతి ఉపాధ్యాయుడు అందుకోవాలని కోరుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు జేవీఎస్ లక్ష్మి, హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ గూడూరు డివిజన్ కన్వీనర్ దీవి అనంత చార్యులు, ఉపాధ్యాయులు గిరి రెడ్డి, గోపి, విజయలక్ష్మి, కరిముల్లా, శ్రీనివాసులు, బాలకృష్ణ, సిబ్బంది గాయం దేవదాసు, శ్రీరామసేన యువకులు వంశి, రాజేష్, గురు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## మరో అవకాశమిచ్చి మోసపోవద్దు

కోట,అక్టోబర్ 17 ప్రభాతవార్త



వైకాపా నాయకులకు వచేంచ అసెంబ్లీ ఎన్నికల్లో మరో అవకాశమిచ్చి మోసవపోవద్దంటూ తెదేపా తిరుపతి పార్లమెంటు నియోజక వర్గం జిల్లా కార్యదర్శి తూపిలి రాధాకృష్ణారెడ్డి అన్నారు. ఆయన సోమవారం కోటలో విలేకరులతో మాట్లాడారు.మూడేళ్ల కాలంలో వైకాపా ప్రభుత్వం అభివృద్ధి చేయలేదన్నారు. గతంలో శాసన సభ్యులు పాశం సునిల్ కుమార్ చేసిన అభివృద్ధి కనబడుతోందన్నారు. రైతులు పేరిట వైకాపా సర్కార్ మోసం చేస్తోందన్నారు. కేంద్రం ఇచ్చి నిధులను కూడా తమ నిధులగా భావిస్తూ రైతులను దగా చేస్తుందన్నారు.గతంలో తెదేపా హాయంలో రైతులకు జరిగిన లబ్ధిని ఈ ప్రభుత్వం తక్కువగా చేసి చూపుతోందన్నారు. ప్రధాని మంత్రి గత 40 నెలల కాలంలో రూ 12 వేల కోట్లను మంజారు చేస్తే రూ 26 కోట్లగా రైతు భరోసాగా వైకాపా ఆర్భాటంగా ప్రకటించడం పెద్ద బోగస్ అన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణ పాఠం చెబుతున్నారని ఆయన విమర్శించారు.

## పాస్టర్లకు చుక్కలు చూపిస్తున్న సచివాలయ ఉద్యోగులు

కోట, అక్టోబర్ 17 ప్రభాతవార్త

కోట మండలంలోని పలు గ్రామాల సచివాలయాల ఉద్యోగులు పాస్టర్లకు చుక్కలు చూపిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ సంయుక్త కార్యదర్శి రెవరెం ఎం.జి.జోసఫ్ ఆరోపించారు. ఆయన సోమవారం కోటలో విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్చకులకు, ఇమామ్‌లకు, ముజావర్లతో పాటు చర్చి పాస్టర్లకు కూడా ప్రతి నెలా గౌరవ వేతనం ఇస్తోందని, ఇందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర క్రిస్టియన్ల సమాజం తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని చెప్పారు. మొదటి విడతలో గౌరవ వేతనం కోసం దరఖాస్తులు చేసుకోని వారికి రాష్ట్రప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని, పాస్టర్లకు ఇది మంచి అవకాశమని చెప్పారు. అయితే ఈ గౌరవ వేతనం కోసం దరఖాస్తులు చేసుకోవడానికి సచివాలయాలకు వెళుతున్న పాస్టర్లకు సచివాలయ సిబ్బందికి అవగాహన లేకపోవడంతో గూడూరు డివిజన్‌లోని సచివాలయ ఉద్యోగులు నిర్లక్ష్యంగా సమాధానం చెప్తున్నారని విమర్శించారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని సచివాలయ సిబ్బంది తగిన సూచనలు ఇవ్వాలని ఆయన కోరారు.

## రూ.2.40 లక్షల విలువైన టపాకాయలు సీజ్

పలమనేరు అక్టోబర్ 17 ప్రభాతవార్త :



పలమనేరు పట్టణంలో అక్రమంగా నిల్వ వుంచిన రూ.2.40లక్షల విలువచేసే టపాకాయలను సిఐ చంద్రశేఖర్ సోమవారం సీజ్ చేయడం జరిగింది. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పలమనేరు పట్టణంలోని ఎంఎం రత్నం వీధిలో నివాసమున్న ఆదినారాయణ శెట్టి అతని నివాసంలో అక్రమంగా సుమారు రూ.2.40 లక్షల విలువచేసే అక్రమ టపాకాయల నిల్వను గుర్తించి సీజ్ చేయడం జరిగిందని తెలిపారు.ఈ మేరకు అతనిపై కేసు నమోదుచేయడం జరిగిందని తెలిపారు.ఎటువంటి అనుమతులు లేకుండా టపాకాయలను అక్రమంగా నిల్వచేసినా,విక్రయించినా వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐలు నాగరాజు,సుబ్బారెడ్డిలు తదితరులు పాల్గొన్నారు.

## ఉచితంగా విద్యార్థినిలకు యూనిఫాం పంపిణీ

కాణిపాకం, అక్టోబర్ 17 ప్రభాతవార్త:



కాణిపాకం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియేట్ (హైస్కూల్ ప్లస్) చదువుతున్న 40 మంది విద్యార్థినిలకు సోమవారం దాతలచే ఉచితంగా యూనిఫాం పంపిణీ చేశారు. సోమవారం కాణిపాకం గ్రామ పంచాయతీ సర్పంచ్ కెఎస్. శాంతిసాగర్‌రెడ్డి సతీమణి చంద్రకళ పాఠశాలలో చదివే 40 మంది విద్యార్థినిలకు సుమారు 50 వేల రూపాయల విలువ గల యూనిఫాంను ఒక్కొరికి రెండు జతల వంతున పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం రెడ్డెప్పనాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దాతలు యూనిఫాంను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థి భవిష్యత్ నిర్ణయించేలా బోధనా పద్ధతులు

ఐరాల, అక్టోబర్ 17 ప్రభాతవార్త:

తరగతి గదిలో విద్యార్థి భవిష్యత్ నిర్ణయించేలా ఉపాధ్యాయులు బోధనా పద్దతులు అనుసరించాలని ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఈనెల 20 వరకు నాలుగు రోజుల పాటు జరిగే టీచింగ్ అట్ ద రైట్ లెవల్ మొదటి దశ శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. ఈకార్యక్రమానికి ఎంఈఓ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ ఉపాధ్యాయులు సరళమైన పద్ధతితో విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించాలన్నారు. అలాగే రీసోర్స్ పర్సన్‌లు ఎం.రమాదేవి, ఆర్.కుమారస్వామినాయుడులు మాట్లాడుతూ విద్యార్థులకు సులభ పద్ధతితో అభ్యసన, ప్రాథమిక స్థాయి నుండి కథా స్థాయి వరకు రెండు సమూహాలుగా వర్గీకరించి బోధించాలన్నారు. ఈకార్య క్రమంలో సీఆర్పీలు శైలజ, రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ద్వితీయశ్రేణి ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు

పెద్దపంజాణి అక్టోబర్ 17 ప్రభాతవార్త :

మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ద్వితీయశ్రేని ఉపాధ్యాయులకు టి.ఏ.ఆర్.ఎల్ శిక్షణా తరగతులను మండల విధ్యాశాఖా అధికారిని హేమలత సోమవారం ప్రారంభించారు.అభ్యసనలో వెనుకబడిన విధ్యార్థులను ముందుకు తీసుకువచ్చే విషయాలలోఈ టి.ఏ.ఆర్.ఎల్ బోధనా విధానం ద్వితీయశ్రేని ఉపాధ్యాయులకు ఉపయోగకరంగా వుంటుందని ఎంఈఓ తెలిపారు.

## కర్నాటక మద్యం స్వాధీనం - ఒకరు అరెస్టు

చిత్తూరు, అక్టోబర్ 17 ప్రభాతవార్త:



చిత్తూరు రూరల్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్స్‌పెక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం బంగారుపాళ్యం మండలం రాగిమానుపెంట గ్రామ పరిసరాల్లో సిబ్బంది దాడులు నిర్వహించి పొదల్లో దాచివుంచిన 96 కర్నాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. రాగిమానుపెంట పరిసరాల్లో కర్నాటక మద్యం విక్రయిస్తున్నారని ఎస్ఇబి పోలీసులకు సమాచారం అందడంతో ఈ మేరకు ఇన్స్‌పెక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎస్ఐ మోహన్‌రావు, సిబ్బంది కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో బంగారుపాళ్యం మండలం ఎగువ రాగిమానుపెంట గ్రామంకు చెందిన ఈశ్వరయ్య(40)ను ఎస్ఇబి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

